క్లుప్తంగా

గ్రామ దేవత పైడమ్మకు పూజలు



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామ దేవత పైడమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామ దేవతకు పూజలు నిర్వహించి గ్రామం సుభిక్షంగా ఉండి ప్రజలు సుఖ సంతోషాలు, పాడి పంటలు సమృద్ధిగా ఉండటమే కాక వ్యాపార అభివృద్ధి చెందాలని ప్రజలు ఆకాంక్షించారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకే ఉల్లాస్



నిజాంపట్నం: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ ఏపీఎం డి.మస్తాన్ అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్య అంచనాల పరీక్షలను ఆయన పర్యవేక్షించి అనంతరం మాట్లాడారు. గ్రామీణుల్లో నూరు శాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పొదుపు సంఘాలకు చెందిన 670 మంది మహిళలకు విద్యను అందించగా 645 మంది పరీక్షలు రాశారు. కార్యక్రమంలో వయోజన విద్యా శాఖ ప్రతినిధి సీహెచ్ శివరామప్రసాద్, సీసీలు శేషగిరిరావు, గాంధీ, శేషావతారం, ఆనంద్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించటం తగదు

రేపల్లె రూరల్: నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులను వెంటనే శిక్షించాలని దళిత, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు చెప్పుల దండ వేయడాన్ని ఆయా సంఘాల ప్రతినిధులు తీవ్రంగా ఖండించాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, రాష్ట్ర సెక్రటరీ దర్శి భాస్కరరావు, న్యాయవాదులు దారం సాంబశివరావు, జీ సురేష్ పాల్గొన్నారు.

తపాలా బీమా ప్రతి పౌరునికి ధీమా



రేపల్లె రూరల్: తపాలా శాఖలో ప్రవేశపెట్టిన గ్రామీణ తపాలా జీవిత బీమా 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మార్చి 24వ తేదీన గ్రామీణ తపాలా జీవిత బీమా దినోత్సవం జరపనున్నట్లు రేపల్లె సబ్ డివిజన్ పోస్టల్ అధికారి కొదమల ఏడుకొండలు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. తపాలా జీవిత బీమా పథకం ప్రతి పౌరుడికి ధీమాగా ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో 19 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల లోపు గల ప్రతి పౌరుడు తపాలా జీవిత బీమా పథకంలో భాగస్వాములు కావచ్చన్నారు. పాలసీ అంగీకరించిన తేదీ నుంచి పూర్తి బీమా సౌకర్యం పోస్టల్ బీమా సంస్థ కల్పిస్తుందని అన్నారు. ప్రీమియం దేశ వ్యాప్తంగా ఏ పోస్ట్ ఆఫీస్ నుంచైనా చెల్లించవచ్చన్నారు. ఒక సంవత్సరం ప్రీమియం ముందే చెల్లించిన వారికి రిబేటూ కలదన్నారు. ఆదాయ పన్ను మినహాయింపు కూడా ఉంటుందని అన్నారు. గ్రామీణులు అందుబాటులో ఉన్న తపాలా కార్యాలయంలో సంప్రదించి తపాలా శాఖ వారి జీవిత బీమా పాలసీ పొందాలన్నారు.

గ్రామాల్లో దాహం కేకలు



తాగునీటిని మోసుకొని తెచ్చుకుంటున్న హనుమంత్‌నగర్ ప్రజలు



బోరుపాయింట్ నుంచి తాగునీటిని తీసుకెళ్తున్న ఆదర్శనగర్ ప్రజలు

- ఐదు రోజులుగా నిలిచిన తాగునీటి సరఫరా
- బావులు.. బోరింగ్ నీరే దిక్కు
- తాగునీరు కొనుగోలు చేయలేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

బాపట్లటౌన్: మండలంలోని తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలను తాగునీటి సమస్య వేధిస్తోంది. గొంతు తడుపుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ బోరు వేసినా ఉప్పు నీరు కావడంతో తాగునీటి కోసం కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరు పాయింట్లు, బావులను ఆశ్రయించి దాహార్తి తీర్చుకుంటున్నారు. కలుషిత నీరు తాగడం వలన ఎక్కడ అంటురోగాలు ప్రబలుతాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఓ వైపు భానుడు భగభగ మండిపోతుండటం, రోజుల తరబడి తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.

5 రోజులుగా నిలిచిన నీటి సరఫరా

మండలంలోని 9 గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులు ఉన్నాయి. ఈ ట్యాంకుల పరిధిలో 25 గ్రామాలకు పైగా సుమారు 20 వేల మంది ప్రజలు ఉన్నారు. గడిచిన ఐదు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా భావించిన మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు 20 లీటర్ల నీటి క్యాన్‌ను రూ.20 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టించుకోని పాలకులు.. అధికారులు

గడిచిన ఐదు రోజులుగా తీర ప్రాంతంలోని 25 గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులు గాని, అధికారులు గాని ఆయా గ్రామాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. మండలంలోని కొత్త కంకటపాలెం సమీపంలోని రక్షిత మంచి నీటి చెరువు నుంచి తీర ప్రాంతంలోని రక్షిత మంచి నీటి వాటర్ ట్యాంక్‌లకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. చెరువులో నీటిని వాటర్ ట్యాంకులకు సరఫరా చేసే క్రమంలో మోటార్లు మరమ్మతులకు గురైన కారణంగా నీటి సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసినా కనీసం ఆయా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేసిన దాఖలాలు లేవు. దాహార్తి తీర్చుకునేందుకు పేద ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు.

శుద్ధి చేయటం లేదు



మాకు సరఫరా చేసే తాగునీరు శుద్ధి చేయటం లేదు. నెలరోజులుగా కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీరు బురద వాసన వస్తున్నాయి. నీరు రంగుమారి ఎర్రగా ఉండటంతోపాటు దుర్వాసన వెదజల్లుతున్నాయి. నీటిని శుభ్రం చేసి వదలాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి నీటిని శుద్ధి చేసి విడుదల చేస్తే బాగుంటుంది.

– కొక్కిలిగడ్డ సుబ్బారావు, ఆదర్శనగర్

సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం

తీర ప్రాంతాల్లోని ప్రజలు దాహార్తి తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి రాలేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– పి.బాబురావు, ఎంపీడీవో, బాపట్ల

బోరు నీరే దిక్కు



ఐదు రోజులుగా మంచినీటి సరఫరా నిలిపివేశారు. దాహార్తి తీర్చుకునేందుకు మా గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరు పాయింట్ దగ్గరకు వెళ్లి తాగునీటిని బిందెలతో మోసుకొని తెచ్చుకుంటున్నాం. రోజుకు మూడుసార్లు తిరగాల్సి వస్తుంది. చిన్నపిల్లలు ఉన్న ఇల్లు కావడంతో మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదు రోజులుగా నీటి కోసం పాట్లు పడుతున్నాం.

– శీలం భూలక్ష్మి, హనుమంత్‌నగర్

పట్టించుకోవడం లేదు



మా గ్రామంలో ఎక్కడ బోరు వేసినా ఉప్పునీరే పడుతుంది. సురక్షితమైన నీటిని అందించేందుకు గతంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఐదు రోజులుగా నీరు సరఫరా కావడం లేదు. ఇటీవల కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీరు రంగు మారి, మురికి వాసన వస్తున్నాయి. ఆ నీటిని తాగితే ఎక్కడ రోగాలు వస్తాయోనని భయంగా ఉంది. మేము ఇన్ని ఇబ్బందులు పడుతున్నా అధికారులు మా బాధలను పట్టించుకోవడం లేదు.

– కొక్కిలిగడ్డ వెంకటేశ్వరమ్మ, ఆదర్శనగర్

బిందెలతో మోసుకొని



బిందె నీరు కావాలంటే రూ.20 పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తుంది. చిన్నపిల్లలు ఉన్న ఇల్లు కావడంతో రోజుకు మూడు బిందెల నీళ్లు కావాల్సి వస్తుంది. రెక్కాడితే గాని డొక్కాడని మాలాంటి ప్రజలు తాగునీటి కోసం రోజుకు రూ.60 ఖర్చు చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి బిందెలతో మోసుకొని నీటిని తెచ్చుకుంటున్నాం. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

– శీలం శివపార్వతి, హనుమంత్‌నగర్

భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్



భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీహెచ్ మజుందార్ తదితరులు



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు



భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

బాపట్లటౌన్: భగత్‌సింగ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ తెలిపారు. భగత్‌సింగ్ వర్ధంతి పురస్కరించుకొని ఆదివారం ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీహెచ్ మజుందార్ మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో అతి చిన్న వయసులో బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడిన విప్లవవీరుడు భగత్‌సింగ్ అన్నారు. చిన్న వయసులోనే ఉరి కంభం ఎక్కిన ఘనత భగత్‌సింగ్‌దే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.బుచ్చిరాజు, సీఐటీయూ నాయకులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విప్లవ వీర కిశోరం భగత్‌సింగ్

బాపట్ల: పిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసి భగత్‌సింగ్ అమరుడయ్యారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డాక్టర్ పి.సి.సాయిబాబు మాట్లాడుతూ భగత్‌సింగ్ చిరునవ్వుతో ఉరి కంబం ఎక్కారన్నారు. దేశ బంగారు భవిష్యత్తు దార్శనికుడని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దగ్గుబాటి సురేష్, ఉపాధ్యాయ నాయకులు వినయ్ కుమార్, న్యాయవాది జమ్రుద్ బాషా, ఎస్వీఎస్ ప్రసాద్, ప్రకాశరావు, నర్రా సాంబు, రౌతు వేణు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ సేవలు చిరస్మరణీయం

రేపల్లె రూరల్: యువతలో దేశభక్తి పెంపొందేలా చైతన్య పరిచి దేశ స్వాతంత్య్ర సిద్ధికై నిర్విరామ కృషి చేసి చిరుప్రాయంలోనే ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ సేవలు అజరామరమని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం, ప్రజా సంఘాలు, విద్యార్థి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ పాలనను వ్యతిరేకిస్తూ స్వాతంత్య్రం కోసం చిన్న వయసులోనే దేశ భక్తిని నింపుకున్న మహనీయుడన్నారు. దేశంలో విదేశీ పాలన ఉండకూడదని బ్రిటీష్ పాలకులు దేశం నుంచి వెళ్లిపోవాలని భగత్‌సింగ్ దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో చిన్న వయసులోనే ప్రాణాలర్పించారన్నారు. యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.ఆశీర్వాదం, కె.వి.లక్ష్మణరావు, వై.నవీన్, ధర్మరాజు, శ్రీనివాసు, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్‌కు నివాళి

భట్టిప్రోలు: బ్రిటీష్ పాలకుల దాస్య శృంఖలాల నుంచి దేశ విముక్తి కోసం 23 సంవత్సరాలకే ప్రాణత్యాగం చేసిన మహోన్నతుడు భగత్‌సింగ్ అని బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి పురస్కరించుకుని భట్టిప్రోలులో ఆయన చిత్రపటానికి ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ బానిసత్వ విముక్తి, సొంత పాలన కోసం బ్రిటీష్ వారిని గడగడలాడించిన ధీరోదాత్తుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. భగత్‌సింగ్ అడుగుజాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దేపల్లిలో...

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతిని భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం బ్రిటీష్ సామ్రాజ్య వాదులపై పోరాడి ఉరి కంభాన్ని ముద్దాడిన గొప్ప దేశ భక్తుడని అన్నారు. మహనీయులైన వీరులను విద్యార్థులు, యువకులు, ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని కోరారు.

అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా



అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా అందించిన మసీదు పెద్దలు

బాపట్ల : అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని మసీదుల పేస్మామ్, మౌజన్లలకు రంజాన్ తోఫా అందించడం జరిగిందని అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం జానీ తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని అంజుమన్ మసీదు ప్రాంగణంలో ఆదివారం రంజాన్ తోఫా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షులు రహీమ్ జానీ మాట్లాడుతూ అంజుమన్ సంస్థ పట్టణంలోని అన్ని మసీదులకు పెద్దన్న పాత్ర పోషిస్తుందన్నారు. పట్టణంలోని అన్ని మసీదులకు కావలసిన మౌలిక సదుపాయాలు అంజుమన్ సంస్థతోనే జరుగుతుందన్నారు. పట్టణంలోని ముస్లింలకు సంబంధించి ఏ కార్యక్రమం చేపట్టాలన్నా అన్ని మసీదుల పెద్దలు, అంజుమన్ సంస్థతో చర్చించి ఆ కార్యక్రమానికి శ్రీకారం చేపడతారన్నారు. అంతే కాకుండా అంజుమన్ సంస్థ పట్టణంలోని నిరుపేద ముస్లింలకు అండగా నిలుస్తుందన్నారు. నిరుపేద అమ్మాయిల పెళ్లిళ్లకు కూడా అంజుమన్ సంస్థ సహాయం అందిస్తుందన్నారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని 17 మసీదుల పేస్మామ్లకు రూ.5000, మౌజన్లలకు రూ.3000 చొప్పున రంజాన్ తోఫా అందించడం జరిగిందన్నారు. గతంలో రంజాన్ తోఫా కేవలం ఐదు మసీదులకు మాత్రమే అందించే వారమని ఈ నూతన కమిటీ ఏర్పడిన నాటి నుంచి పట్టణంలోని 17 మసీదులకు రంజాన్ తోఫా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ ప్రెసిడెంట్ బాజీవలి, సెక్రటరీ అబ్దుల్ కరీం, జాయింట్ సెక్రటరీ రఫీ, ట్రెజరర్ మీరా సాహెబ్, మెంబర్లు మౌలాలి, ఆదం, మజీద్, ఖాసిం, సిద్దయ్య, హనీఫ్, పేష్మాములు, మౌజన్లు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం ధ్యాన శక్తితోనే సాధ్యం



ధ్యానం విశిష్టతను తెలియజేస్తున్న రిటైర్డ్ డిఫెన్స్ ఇంజనీర్ లలిత ప్రసాద్



ధ్యానం చేస్తున్న ప్రజలు

- సంపూర్ణ ఆరోగ్యం ధ్యాన శక్తితోనే సాధ్యం
- రిటైర్డ్ డిఫెన్స్ ఇంజనీర్ లలిత ప్రసాద్

రేపల్లె రూరల్: ధ్యాన శక్తితో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని రిటైర్డ్ డిఫెన్స్ ఇంజనీర్ ఎస్.లలిత ప్రసాద్ అన్నారు. ది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ సహకారంతో పట్టణంలోని తటవర్తి రామ్మోహనరావు కల్యాణ మండపంలో పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అఖండ ధ్యాన శిక్షణా జ్ఞాన బోధ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిద్రలేచినది మొదలు ఉరుకులు, పరుగుల జీవనం, అభద్రతా భావం, కనీసం ఆరోగ్యంపై దృష్టి మరల్చలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవిత పోరాటంలో మానసిక, శారీరక రుగ్మతలు పొందుతూ మనోవేదనకు గురవుతున్నారన్నారు. నిత్యం కొంత సమయం ధ్యానం చేయటంతో మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. మానసిక ప్రశాంతతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుదల, ఆత్మస్థైర్యం వంటివి పొందవచ్చన్నారు. ఎవరి వయస్సు ఎంత ఉంటుందో కనీసం అన్ని నిమిషాలు తప్పనిసరిగా రోజుకు రెండు పర్యాయాలు ధ్యానం చేయటాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. 41 రోజుల పాటు నిర్వహిస్తున్న ధ్యాన శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు బందురు లక్ష్మి, సభ్యులు మంజుల, నీలిమ, నిరంజన్, ప్రసన్నాంజనేయులు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దైవం చూపిన మార్గంలో నడవాలి

కనగాలలో ఇఫ్తారు విందు ఏర్పాటు చేసిన డాక్టర్ గణేష్



ఇఫ్తారు విందులో రేపల్లె, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్తలు డాక్టర్ గణేష్, వరికూటి అశోక్

చెరుకుపల్లి: దైవం చూపిన మార్గంలో నడవటంతో పాటు దైవ చింతనతో శ్రద్ధాభక్తులతో అల్లా కృపకు పాత్రులయ్యేందుకు రంజాన్ మాసంలో ముస్లింలు చేసే కఠోర ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. రంజాన్ నెలను పురస్కరించుకుని మండలంలోని కనగాల గ్రామంలో ముస్లిం సోదరులకు ఆదివారం రాత్రి ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కఠోర ఉపవాస దీక్షలతో పాటు తోటివారిని ఆదుకోవటం, దానాలు చేయటం పలువురికి ఆదర్శనీయాలన్నారు. నియమ నిష్టలతో కూడిన జీవనాన్ని అవలంబిస్తూ, ధర్మ మార్గంలో నడుస్తూ ఖురాన్‌లో అల్లా తెలిపిన సూక్తులను ఆచరిస్తూ ముస్లింలు తోటివారికి మార్గదర్శకులుగా నిలుస్తారని పేర్కొన్నారు. రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వేమూరు, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు వరికూటి అశోక్‌బాబు, గాదె మధుసూధనరెడ్డి, పాణెం చినహనిమిరెడ్డి, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్, రేపల్లె పట్టణ, మండలం, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, దుండి వెంకట రామిరెడ్డి, ఇంకొల్లు రామకృష్ణ, యార్లగడ్డ రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

నగరం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ చెప్పారు. మండలంలోని న్యూ అంబేడ్కర్ నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నన్నా రెడ్డియ్య వర్ధంతి కార్యక్రమంలో ఆదివారం డాక్టర్ ఈవూరి గణేష్ రెడ్డియ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట నగరం, చెరుకుపల్లి మండలాల కన్వీనర్‌లు ఇంకోల్లు రామకృష్ణ, వెంకటరామిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.కోటేశ్వరరావు, బీసీ సెల్, వికలాంగ విభాగం, యువత, బూత్ కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు పాగోలు వెంకటేశ్వరావు, బాలకృష్ణ, కొండలరెడ్డి, రాజశేఖర్, నాయకులు శ్యాంప్రసాద్, మద్దయ్య, శ్రీవర్దన్ బాబు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



శిబిరంను పర్యవేక్షిస్తున్న డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, ఉమేష్ చంద్ర, మెర్సీ ప్రిస్కిల్లా

భట్టిప్రోలు: హార్వెస్ట్ ఇండియా, భట్టిప్రోలు కేఎస్‌కే విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం శంకర్ కంటి ఆసుపత్రి (పెదకాకాని) భట్టిప్రోలులోని కేఎస్‌కే విద్యా సంస్థలో నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనాల మనుమడు హ్యాండీ జోయల్ మొదటి పుట్టిన రోజు సందర్భంగా శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉమేష్ చంద్ర, మెర్సీ ప్రిస్కిల్లా, సురేష్ కుమార్‌లు శిబిరం ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ అబోలి, డాక్టర్ నీతా 600 మందిని పరీక్షించారు. శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయబడునని చెప్పారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు శిబిరానికి విచ్చేసారు.

వేసవిలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి

మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణవేణి



చుండూరు(వేమూరు): ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కృష్ణవేణి తెలిపారు. చుండూరు మండలంలోని వేటపాలెం పీహెచ్‌సీలో ఆదివారం ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎండలో ఎక్కువగా తిరగకూడదని.. బయటికి వెళ్లవలసి వస్తే గొడుగు, టోపి లాంటివి వాడాలని, మోహంపై కర్చీఫ్ లాంటివి కట్టుకోవాలని అన్నారు. తగినన్ని నీళ్లు తాగాలని, వదులుగా ఉండే దుస్తులు ధరించాలన్నారు. శరీరం వేడెక్కినట్లు, తల తిరుగుతున్నట్లు ఉండి శరీర ఉష్ణోగ్రత పెరిగితే ఓఆర్ఎస్, ఇతర ద్రవ పదార్థాలు తాగాలని ఆమె తెలిపారు. అధిక ఉష్ణం, తలనొప్పి, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బ సంకేతాలుగా భావించాలన్నారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే తప్ప బయటకు రాకూడదన్నారు. వడ దెబ్బ లక్షణాలు ఉంటే సమీపంలోని ఆశ కార్యకర్త ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలను, పీహెచ్‌సీ సిబ్బందిని సంప్రదించి చికిత్స తీసుకోవాలని ఆమె చెప్పారు.

సారూ.. ప్రచారం సూపరు !

పాఠశాలల్లో విద్యార్థుల చేరిక కోసం ప్రభుత్వ ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం



ద్విచక్రవాహనంపై మైకులో ప్రచారం చేస్తున్న వెంకయ్య

తెనాలి: ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే ప్రమాదముంది... వేసవిలో కౌన్సెలింగ్ తదుపరి కొన్ని పాఠశాలలు మూతపడే అవకాశమూ ఉంది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒకరు వినూత్న ప్రచారం ఆరంభించారు. మళ్లీ పాఠశాలలు పునఃప్రారంభం జరిగే వరకు దాదాపు 90 రోజులపాటు కొనసాగిస్తారు. 'అందరిదీ విద్య, అందరిదీ బాధ్యత' నినాదంతో చేపట్టారు.

మార్చి 15 నుంచి ప్రచారం..

బోధనకే పరిమితం కాకుండా తన వంతు సామాజిక బాధ్యతగా ఈ ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టిన ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య. నివాసం తెనాలి రూరల్ మండల గ్రామం సంగం జాగర్లమూడి. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలం వేటపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో పని చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పాలంటూ ఆయన తల్లిదండ్రులు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇందుకోసం 13 నిమిషాల ఆడియోను రూపొందించారు. తన ద్విచక్ర వాహనానికి అమర్చుకున్నారు. హైస్కూళ్లు, కూడలి ప్రాంతాలు, గ్రామాల్లో పర్యటిస్తున్నారు. మార్చి 15వ తేదీన ఈ ప్రచారం ఆరంభించారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతున్నందున సాయంత్రం ప్రచారం చేస్తున్నారు. ఇతర రోజుల్లో మధ్యాహ్నం నుంచి పర్యటిస్తున్నారు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో సగభాగం కవర్ చేయాలనేది తన ఆకాంక్షగా చెప్పారు.

26 అంశాలపై...

ప్రభుత్వం ఉచిత విద్య కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తోందని, అర్హులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని చాటుతున్నారు. అంతేకాకుండా ఉచిత యూనిఫాం, బ్యాగులు, షూలు, బెల్టులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్సులు, మధ్యాహ్న భోజనం, టీవీ, రేడియోలతో బోధన, సౌకర్యాలు సహా మొత్తం 26 అంశాలపై ప్రచారం చేస్తున్నారు. అందరూ చదవాలి...అందరూ ఎదగాలంటూ ప్రచిరం చేస్తున్నారు. ఆ క్రమంలో తెనాలి కొత్తపేటలో పర్యటిస్తున్నప్పుడు తీసిన ఫొటో ఇది...

కొనుగోలు కేంద్రం ప్రారంభం

అమర్తలూరు(వేమూరు): రబీ సీజన్‌లో రైతులు పండించిన మినుము, పెసర పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని మినుము, పెసర కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెసర, మినుము పంటలకు ధర లేకపోవడంతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. పెసలు క్వింటా రూ.8,682, మినుము క్వింటా రూ.7,400కు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. తేమ శాతం 12 లోపల ఉంటే కొనుగోలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులందరు మినుము, పెసర పంటలను 12 శాతం వచ్చే వరకు ఎండబెట్టాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గొట్టిపాటి గంగాధర్, మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి రుణాలకు గడువు పొడిగింపు

రేపల్లె రూరల్: స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకునే తేదీని పొడిగించినట్లు ఎంపీడీవో ఎం.శోభారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి రుణాల దరఖాస్తుకు ఈ నెల 22వ తేదీ వరకు ఇచ్చిన గడువును 3 రోజులు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 25 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.